హైదరాబాద్ వార్త



# పాతభవనాలపై ‘ బల్దియా ”ఫోకస్

**-టౌన్‌ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో ముమ్మరంగా సర్వే**
**-శిథిలావస్థలో ఉన్న భవనాలు గుర్తించి నోటీసులు**
**-కుటుంబసభ్యులకు కౌన్సిలింగ్ ..మరమ్మతులకు చర్యలు**
**-అత్యంత ప్రమాదకరంగా ఉంటే బారికేడ్లు ఏర్పాటు**
**-సెల్లార్ ప్రమాదాల నివారణపైనా స్పెషల్ డ్రైవ్**



**హైదరాబాద్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో చారిత్రక కట్టడాలు ఎన్ని ఉన్నాయో ...శిథిలావస్థలో చేరిన భవనాలు కూడా అన్నే ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఏదోఒక చోట శిథిలా భవనాలు కూలిపోవడం ..ప్రాణనష్టం జరగడం సంభవిస్తుంది. కొద్దిరోజుల క్రితం బాచుపల్లిలో గోడకూలి ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. అలాగే వర్షాకాలంలో శిథిలావస్థలో ఉన్న భవనాలు కూలిపోయే ప్రమాదం ఉంది. ఈక్రమంలో శిథిలావస్థలో చేరి బిల్డింగుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని జిహెచ్‌ఎంసి నిర్ణయించింది. నగరంలో ఇలాంటి భవనాలు ఎన్ని ఉన్నాయో సర్వే చేపట్టాలని కమిషనర్ అమ్రపాలి అధికారులను ఆదేశించగా.. డిప్యూటీ సిటీప్లానర్లు, అసిస్టెంట్ సిటీప్లానర్లు కార్యాచరణ రూపొందించి కమిషనర్‌కు అందజేశారు. దీంతో శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సెల్లార్లను , పాతబవనాలపై కొత్తనిర్మాణాలు చేపట్టే వారిని సర్కిళ్ల వారీగా నోటీసులు ఇస్తున్నారు. వాస్తవానికి వర్షాకాలం విపత్తు నివారణలో భాగంగా టౌన్‌ప్లానింగ్ శిథిల భవనాలను గుర్తించడం, పాతభవనాలు పటిష్టత ,భద్రతపై ఇంజనీరింగ్ విభాగాల అభి ప్రాయాలను పరిగణలోకి తీసుకోవడం, అత్యంత ప్రమాదకర కట్టడాలను కూల్చివేసేందుకు టౌన్‌ప్లానింగ్ విభాగం సర్వే చేయాలి. ఈడ్రైవ్‌లో భాగంగా పురాతన భవనాలపై జోన్లవారీగా సర్వేచేసి సంబంధిత భవన నాణ్యతపై పరిశీలించి వారికి నోటీసులు ఇవ్వడమే కాకుండా వాటిని కూల్చివేడయం వంటివి చేయాలి. కానీ పలుజోన్లలో ఇలాంటి చర్యలు తీసుకోకుండా కేవలం నోటీసులు ఇచ్చి వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**సర్కిళ్లవారీగా స్పెషల్ డ్రైవ్..**

వర్షాల కాలం నేపథ్యంలో పురాతన భవనాలు సెల్లార్‌ల ప్రమాదాల జిహెచ్‌ఎంసి టౌన్‌ప్లానింగ్ అప్రమత్తమై చర్యలు వేగవంతం చేసింది. ప్రమాదకర భవనాలపై సర్కిళ్లవారీగా స్పెషల్ డ్రైవ్ చేపడతూ శిథిల, ప్రమాకరమైన భవనాలల్లో ఉన్న నివాసితులను గుర్తించి వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించేందుకు ముందుగా నోటీసుల ఇచ్చి వారికి కౌన్సిలింగ్ చేస్తున్నారు. అలాగే అత్యంత ప్రమాదకరంగా ఉన్న భవనాల సమీపంలోకి ఎవరూ వెళ్లకుండా ఆయా భవనాల చుట్టూ భారికేడ్లను అమర్చుతున్నారు. వీటితోపాటు అక్టోబర్ నెలాకరు వరకు వర్షాకాలంలో సెల్లార్ల నిషేదం అమల్లో ఉంది. ఈక్రమంలో సెల్లార్ ప్రమాదాలు జరగకుండా టౌన్‌ప్లానింగ్ విభాగం చర్యలు చేపడుతుందని జిహెచ్‌ఎంసి అధికారులు తెలిపారు.

**జోన్‌లవారీగా శిథిల భవనాలు వివరాలు ..**

జిహెచ్‌ఎంసి పరిధిలో ఆరుజోన్‌లలో మొత్తం 566 శిథిల భవనాలను జిహెచ్‌ఎంసి గుర్తించింది. అందులో 89 కూల్చివేయగా..146 ఇండ్లు ఖాళీ చేయడం, మరమ్మత్తులు చేయడం చేపట్టారు. మరో 331 భవనాలు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో ఎల్బీనగర్ 75 భవనాలను గుర్తించగా 28 కూల్చివేశారు. అలాగే 34 భవనాల్లో ఖాళీ చేయించడంతోపాటు మరమ్మత్తులు చేపట్టారు. ఈసర్కిల్‌లో ఇంకా 13భవనాలు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే చార్మినార్‌లో154 శిథిల భవనాలు ఉంటే అందులో 28మాత్రమే కూల్చివేశారు. 25 భవనాలు ఖాళీ చేయించగా ఇంకా 101 భవనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఖైరతాబాద్ సర్కిల్‌లో 123 ఇండ్లను గుర్తిస్తే అందులో 17మాత్రమే కూల్చి 46 ఇండ్లకు మరమ్మత్తులు చేయిస్తున్నారు. 60భవనాలు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే సికింద్రాబాద్‌లో 32ఇండ్లను గుర్తిస్తే అందులో 11కూల్చివేయగా మరో 11 ఖాళీ చేయించారు. ఇంకా 10 భవనాలపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. కూకట్‌పల్లిలో 49భవనాలను గుర్తిస్తే అందులో 2 ఇండ్లను కూల్చివేశారు. మరో 18 మరమ్మత్తులు చేస్తున్నారు. ఇంకా 29భవనాలపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

# చెరువుల పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళిక

**- హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్**



ఉప్పల్ నల్ల చెరువును సందర్శించిన హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్, కాంగ్రెస్ నేత ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 13 ప్రభాతవార్త :** నగరంలోని చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తుందని హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాద్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని ఉప్పల్ నల్ల చెరువు, కాప్రా ఊర చెరువును ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి ఇచ్చిన పిర్యాదు మేరకు నల్ల చెరువును సందర్శించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ మాట్లాడుతూ చెరువు స్థలాలు కబ్జాకు గురికాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, చెరువు బఫర్ జోన్‌లో ఎటువంటి నిర్మాణాలు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెండు, మూడు వారాల్లో అన్ని శాఖల అధికారులతో సమీక్ష చేసి నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కబ్జాలపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. ఉప్పల్ తహసీల్దార్ వాణిరెడ్డి, ఇరిగేషన్ ఎఇ పృథ్వీ మాట్లాడుతూ ఉప్పల్ నల్ల చెరువు రెండు మండలాల పరిధిలో ఉందని, చెరువు సుమారు 65 ఎకరాల స్థలంలో విస్తీర్ణంలో ఉందని, 18 ఎకరాలు బఫర్ జోన్‌లో ఉందని తెలిపారు. చెరువు నుంచి 30 మీటర్ల బఫర్ జోన్ ఉంటుందని తెలిపారు. ఉప్పల్ మండల పరిధిలో ఎటువంటి అక్రమణలు లేవని, ఫీర్జాది గూడ వైపు గతంలో నుంచే కొన్ని ఆక్రమణలు ఉన్నాయని తెలిపారు. చెరువు కట్టకు వెళ్లే దారిలో డిసిఎం వాహనాలు నిలిపే ప్రాంతంలో గతంలో కొన్ని షెడ్లు నిర్మించారని, వీటిని తొలగిస్తామని తెలిపారు. బఫర్ జోన్‌లో కూడా గతంలో ఒక గుడి నిర్మించారని, మట్టి కూడా పోశారని, దీనిపై పోలీసు కేసు పెట్టామని తహసీల్దార్ వాణిరెడ్డి తెలిపారు. చెరువులు నాలాలు అక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా నల్ల చెరువుకు మూడు వైపులా చేపట్టిన అక్రమణల గురించి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కాంగ్రెస్ పార్టీ నేతలు ఎం.పరమేశ్వర్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్, కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి చెరువులోని అక్రమణల గురించి కమిషనర్‌కు వివరించారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వాణిరెడ్డి, ఉప్పల్ డిప్యూటి కమిషనర్ అంజనేయులు, ఇంజనీర్ ఎల్.నాగేందర్, ఇరిగేషన్ ఎఇ పృధ్వీ, పలువురు పార్టీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

# మంద కృష్ణ మాదిగకు ఘన స్వాగతం



సికింద్రాబాద్ స్టేషన్ వద్ద మంద క్రిష్ణకు ఘన స్వాగతం పలికిన మాదిగ ఉప కులాలు నేతలు

**కంటోన్మెంట్, ఆగస్టు 13 ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ సాధన కోసం 3 దశాబ్దాల కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద క్రిష్ణ మాదిగ చేపట్టిన ఉద్యమంతో సు ప్రీం కోర్టు తీర్పు ద్వారా విజయ తీరాలకు చేరిన నేపథ్యంలో ఢిల్లీ నుంచి మంగళవారం మధ్యాహ్నం వందే భారత్ రైల్‌లో సికింద్రాబాద్‌కు చేరుకున్నారు. ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలోని, జిల్లాల్లోని లక్షలాది మంది మాదిగల ఉప కులాలు తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ ర్యాలీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ క్లాటర్, ప్యాట్నీ చౌరస్తా, ఆర్‌పి రోడ్డు, బైబిల్ హౌజ్, ట్యాంక్ బండ్, అంబేద్కర్ విగ్రహం, బషీర్ బాగ్ చౌరస్తాలోని బాబుజగ్జీవన్ రామ్ విగ్రహం వరకు బారీ ర్యాలీ కొనసాగింది.

**మంద క్రిష్ణ మాదిగకు ఘన స్వాగతం పలికిన కంటోన్మెంట్ నేతలు . .**

మంద క్రిష్ణ మాదిగకు కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన జిల్లా అధికార ప్రతినిధి రొట్టెల సునీల్ మాదిగ, ఏ.ఎల్. ఆనంద్ మాదిగల ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయం వద్ద స్వాగత వేధికలు ఏర్పాటు చేసి మంద క్రిష్ణ మాదిగకు బారీ గజ మాలతో స్వాగతం పలికారు.

**ప్యాట్నీ చౌరస్తాలో . .**

కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జి ఇటుక శ్రీ కిషన్ మాదిగ ఆధ్వర్యంలో ప్యాట్నీ చౌరస్తాలో మంద క్రిష్ణ మాదిగకు బారీ గజమాలతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొంపల్లి విజయ్, సాయి, ప్రవీణ్, శేఖర్, అశోక్, వినోద్, అజయ్, కంటోన్మెంట్ బిజెపి ఇన్‌ఛార్జి డాక్టర్ వంశా తిలక్, మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపికలు పాల్గొని మంద క్రిష్ణ మాదిగకు స్వాగతం పలికారు.

# అపార్ట్‌మెంట్‌లో చెత్తసేకరణకు డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలి

**-విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ల వద్ద చెత్తవేయకుండా చర్యలు తీసుకోవాలి**
**-అధికారులకు జిహెచ్‌ఎంసి కమిషనర్ అమ్రపాలి ఆదేశం**



**హైదరాబాద్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** అపార్ట్‌మెంట్‌లలో డోర్‌టూడోర్ తిరగకుండా ఒకచోట డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేస్తే చెత్తసేకరణ సులభతరం అవుతుందని అందుకోసం అపార్ట్‌మెంట్ అసోసియేషన్ వారిని సంప్రదించి డస్ట్‌బిన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిమెచ్‌ఎంసి కమిషనర్ అమ్రపాలి అధికారులను ఆదేశించారు. ఈమేరకు మంగళవారం ఉదయం అడిషనల్, జోనల్ కమిషనర్లతో కమిషనర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపార్ట్‌మెంట్‌లలో చెత్తసేకరణ వివిధ కారణాల వల్ల పూర్తి స్థాయిలో స్వచ్ఛ ఆటోల్లో వేయడం లేనందున అక్కడి తడి, పొడి చెత్తను వేయడానికి బిన్‌లను ఏర్పాటు చేసుకున్న పక్షంలో అట్టిబిన్‌లలో వేసిన చెత్తను స్వచ్ఛఆటోలు తీసుకుని వెళ్లేందుకు సులభతరం అవుతుందన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్తవేయకుండా తగతిన చర్యలు తీసుకోవాలని పెన్సింగ్ లేని ట్రాన్స్‌పార్మర్ల వివరాల నివేదిక అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్కుల వద్ద పరిశుభ్రంగా ఉండేలా డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను సూచించారు. జంక్షన్‌లవద్ద ఆహ్లాదకరంగా ఉండేలా పూల మొక్కలు ఏర్పాటు చేయాలని యుబిడి అధికారులను ఆదేశించారు. పశువులు రోడ్లపై తిరగడంతో ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున్న రోడ్లపై పశువులు సంచరించకుండా క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.

# మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో తనిఖీలు



మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న ఈస్ట్‌జోన్ డిసిపి బాలస్వామి,అదనపు డిసిపి నర్సయ్య పోలీసులు సిబ్బంది

**బేగంబజార్, ఆగస్టు13ప్రభాతవార్త:** స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఈస్ట్‌జోన్ డిసిపిబాలస్వామి, అదనపు డిసిపి జె.నర్సయ్య పర్యవేక్షణలో పోలీసులు, డాగ్‌స్క్వాడ్ బృందాలతో మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లోని ప్లాట్లుఫారాలను తనిఖీలు చేశారు. ప్రధానంగా బస్‌స్టేషన్ కమాండ్ కంట్రోల్, పార్సిల్ కార్యాలయంలో, బుకింగ్ ఆఫీసు, వెయిటింగ్‌హాల్, ప్లాట్‌ఫారం, ప్రయాణికుల బ్యాగులను తనిఖీలు చేశారు. ఈసందర్భంగా డిసిపి బాలస్వామి మాట్లాడుతూ స్వాతంత్రదినోత్సవాన్ని పురస్కరించుకుని ముందు జాగ్రత్త చర్యగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు ముందస్తుగా బస్‌స్టేషన్‌లో తనిఖీలు, సోదాలు నిర్వహించడం జరిగిందన్నారు. అంతేకాకుండా డాగ్‌స్కాడ్ ద్వారా తనిఖీలు చేశారు. ఈ తనిఖీలు సుల్తాన్‌బజార్ ఎసిపి, అఫ్జల్‌గంజ్, సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర మహిళా దొంగలు అరెస్టు

**హైదరాబాద్, ఆగస్టు13, ప్రభాతవార్త:** నగరంలోని వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర మహిళా దొంగల ముఠాను సుల్తాన్ బజార్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితురాళ్ళు మధ్యప్రదేశ్ వ్యాపారులైన షభానా(22), కుంతీ భాయ్(32), రీనో భాయ్(35), రిహానా(35), మందాకినీ సిసోడియా(35)లుగా గుర్తించారు. డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ యం.మధుకుమార్ వివరాల ప్రకారం, మధ్యప్రదేశ్‌లోని రాజ్‌ఘడ్ ప్రాంతంలో చేరణ్ తెగకు చెందిన ఈ ముఠా, ఆంధ్రప్రదేశ్ స్టువర్ట్‌పురంలో కూడా బృందాలుగా విస్తరించి ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 7వ తేదీన నగరానికి వచ్చిన ఈ దొంగల ముఠా, పలు దుకాణాల్లో వరుస చోరీలకు పాల్పడే పథకంలో భాగంగా, సుల్తాన్ బజార్‌లోని ఓ బట్టల మాల్‌లో దుస్తులు కొనుగోలు చేస్తున్న ఓ ఎన్నారై మహిళ బ్యాగ్‌ను దొంగిలించారు. అందులో రూ.16వేలు నగదు, విదేశీ గ్రీన్ కార్డ్, క్రెడిట్ కార్డు వంటి విలువైన వస్తువులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తులో భాగంగా 200 సీసీ కెమేరాలను పరిశీలించిన అనంతరం మహిళా దొంగల ముఠాను గుర్తించారు. నిందితురాళ్ళపై నిఘా వేసిన పోలీసులు, సికింద్రాబాద్‌లోని వారు బస చేసిన సితార హోటల్‌లో తస్కరించిన డబ్బు, వస్తువులు పంచుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మహిళా చోరులు ఒకేసారి గుంపులుగా దుకాణాల్లో ప్రవేశించి వస్తువులు కొనుగోలు చేస్తున్నట్లు నటిస్తూ, వ్యాపారుల దృష్టి మరల్చి, విలువైన వస్తువులు, అందితే డబ్బు తస్కరిస్తారని, ఇటువంటి చోరీల్లో వీరు చాలా తెలివిగా వ్యవహరిస్తారని మధ్యప్రదేశ్ పోలీసుల సమాచారం. వీరు నగరంలోని పలు ప్రాంతాల్లోకి వెళ్ళి గుట్టు చప్పుడు కాకుండా గిల్టు నగలతో అసలు బంగారు ఆభరణాలను మార్చి అక్కడి నుంచి జారుకుంటారని తెలిపారు. ఈ ముఠా దొంగిలించిన డబ్బుతో రూ.14వేల విలువైన బట్టలను కొనుగోలు చేసినట్లు ప్రాధమిక దర్యాప్తులో తేలింది. నిందితురాళ్ళ నుంచి నకిలీ బంగారు గాజులను, నకిలీ పుస్తెలను, నకిలీ చెవి కమ్మలను కొత్త బట్టలను, రూ.2వేల నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పాతబస్తీలో అగ్ని ప్రమాదం



**చార్మినార్, ఆగస్టు13, ప్రభాతవార్త:** హైదరాబాద్ పాతబస్తీలోని మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కామటిపూరా పరిధిలో పురాణాపూల్ ప్రాంతంలోని స్మశానఘాట్ వద్ద స్వస్తిక్ టెంట్ డెకరేషన్ షాప్ సప్లై గొడౌన్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగింది. గొడౌన్‌లో వివిధ శుభకార్యాలకు వినియోగించే డెకరేషన్ మెటీరియల్ పెద్ద ఎత్తున ఉండడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. షార్ట్ సర్క్యూట్ వల్ల నిమిషాల్లో వ్యాపించిన అగ్ని కిలలు పైకి ఎగసిపడ్డాయి. వెంటనే స్వస్తిక్ డెకరేషన్ దుకాణ వ్యాపారి రాజేశ్ కుమార్ పోలీసులకు సమాచారం అందించడంతో, హుటాహుటీన అగ్నిమాపక సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు రక్షణా చర్యలు చేపట్టారు. అధికారులు 5 ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేయగలిగారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది జాగ్రత్త పడ్డారు. కాగా దాదాపు రూ.5లక్షలు ఆస్తి నష్టం ఉండవచ్చని వారు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## హుస్సాన్ సాగర్‌లో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

**-రక్షించిన సెక్రటేరియట్ పోలీసులు**

**బేగంపేట ఆగస్టు 13, ప్రభాతవార్త**

భర్త విదేశాల్లో ఉండటం, ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతుండటంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఓ మహిళ ట్యాంకు బండ్ వద్ద హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్యకు యత్నించింది. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని ఆ మహిళను రక్షించారు. ఖమ్మం కు చెందిన ఓ మహిళ భర్త విదేశాల్లో ఉంటాడు. అయితే ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా మారడంతో ఐదు రోజుల క్రితం ఖమ్మం నుంచి నగరానికి వచ్చిన ఆ మహిళ నగరంలోని అత్త, అక్క వద్దకు వచ్చింది. మంగళవారం ఇంటి నుంచి ట్యాంకు బండ్‌కు చేరుకుని చిల్డ్రన్స్ పార్కు వద్ద హుస్సేన్ సాగర్ లో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఇది గమనించి పోలీసులు గజ ఈతగాడు ట్యాంకు బండ్ శివ సహాయంతో అమెను రక్షించడంతో ప్రాణాలతో బైటపడింది. ఆమెను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించామని, ఆరోగ్యపరిస్థితి సక్రమంగానే ఉందని సెక్రటేరియట్ పోలీసులు తెలియజేసారు.

## ప్రేమ పెళ్లి అంగీకరించలేదని యువకుడు ఆత్మహత్య..

**కొంపల్లి, ఆగస్ట్ 13, ప్రభాతవార్త**

ప్రేమ పెళ్లికి కుటుంబ సభ్యులు అంగీకరించలేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా, దోమడుగుకు చెందిన గువ్వా శ్రీహరి (21) ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఆమె కుటుంబ సభ్యులు శ్రీహరితో పెళ్లికి అంగీకరించలేదు. మనస్థాపం చెందిన శ్రీహరి కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఉండడంతో కుటుంబ సభ్యులు దోమడుగు నుండి మల్లారెడ్డి ఆసుపత్రిలో చేర్పించారు. కాగా సోమవారం చికిత్స పొందుతున్న శ్రీహరి ఆసుపత్రిలో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. అతని కుటుంబ సభ్యులు తెలిసినవారిని, బంధువులను, స్నేహితులను అడిగినా ఫలితం లేకపోయేసరికి ఆందోళనకు గురై పోలీసులను ఆశ్రయించారు. అయితే ప్రాథమిక నివేదికలో శ్రీహరి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. ఈ మేరకు శ్రీహరి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. శ్రీహరి సోదరి ఆకుల భవాని ఫిర్యాదు మేరకు సూరారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఖైదీలకు ఎస్కార్ట్ పోలీసుల రాచమర్యాదలు...

**-హోటల్లో ఇరానీ టీ తాగించిన వైనం**

**మలక్‌పేట, ఆగస్టు 13 ప్రభాతవార్త:** ఖైదీలకు ఎస్కార్ట్ పోలీసులు రాచమర్యాదలు చేశారు. చాదర్ ఘాట్ నయాగ్రా హోటల్ వద్ద వాహన్నా ఆపి ఎస్కార్ట్ పోలీసులు ఇరానీ టీ తాగించి జైలుకు సాగనంపారు. సదరు వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ముగ్గురితో కూడిన పోలీస్ ఎస్కార్ట్ వాహనం చాదర్ ఘాట్‌లోని నయాగ్రా హోటల్ వద్ద ఆగింది. కోర్టు నుంచి నేరుగా హోటల్ వద్దకు చేరుకున్న ఎస్కార్ట్ వాహనంలో చేతికి బేడీలతో ముగ్గురు ఖైదీలు ఉన్నారు. పోలీసులు, ఖైదీలు ఎంచక్కా 10 నిమిశాల పాటు అక్కడే గడిపి టీతాగా తాఫీగా జైలుకు వెళ్లారు. పోలీసుల తీరుపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జైలుకు తరలిసున్న ఖైదీలకు హోటల్ టీ ఇస్తారా అని మండిపడ్డారు. ఇలాంటి పోలీసులపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు కోరుతున్నారు.

# రచయిత మేధోమథన తార్కాణం తెరవెనుక

**-రాష్ట్ర ఎన్నికల పూర్వ కమిషనర్ పార్థసారథి**



తెరవెనుక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పార్థసారథి, కోటేశ్వరరావు, విజయలక్ష్మి, ఉమాదేవి తదితర అతిథులు

**రవీంద్రభారతి, ఆగస్టు 13 ప్రభాతవార్త :** ఏదైనా ఒక నాటక, సినీ, బుల్లితెర తదితర ప్రదర్శనలో కళ్ల ఎదుట కనిపించకుండా ఉండే విషయాన్ని లోతుగా పరిశీలించి చూసే పరిశోధాత్మక ప్రక్రియే తెరవెనుక అని, రచయిత మేధోమథనానికి తార్కాణంగా నిలుస్తుందని, రచయిత్రి తెరవెనుక పుస్తక రచనకు దారితీసి ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల పూర్వ కమిషనర్ సి.పార్థసారథి అన్నారు. ఆమె తపనలో నిజం, నిజాయితీ, పస ఉందని స్పష్టం చేస్తూ ఆయా ప్రదర్శనల తెరవెనుక వైవిధ్యాన్ని విశదీకరించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, సరసిజ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని ప్రివ్యూ థియేటర్‌లో మంగళవారం రాత్రి ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు రామకోటేశ్వరరావు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఎన్నికల పూర్వ కమిషనర్ సి.పార్థసారథి విశిష్ట అతిథులు డా. మామిడి హరికృష్ణ, రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మి, డా. వెంకట్ గోవాడ, సమ్మెట ఉమాదేవి, కె.సరస్వతి, సర్వమంగళగౌరి తదితరులతో కలిసి ప్రముఖ రచయిత్రి డా. సమ్మెట విజయ రచించిన తెరవెనుక పుస్తకాన్ని ఆవిష్కరించి రచయిత్రిని ఎంతగానో అభినందించి ఘనంగా సన్మానించి మరెన్నో రచనలు కలం ద్వారా జాలువారాలని ఆకాంక్షించారు. తదుపరి అంకితోత్సవం నిర్వహించారు. సభకు సమ్మెట ఉమాదేవి స్వాగతం పలుకగా కె.సరస్వతి పరిచయం మంగళగౌరి గ్రంథ సమీక్ష కావించారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా కృషి చేయాలి

**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**హైదరాబాద్, ఆగస్టు13, ప్రభాతవార్త:** విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన జరిగేలా ఉపాధ్యాయుల్లోని అధికారులు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలు , మండల నోడల్ అధికారులు పాఠశాలలు సందర్శించినపుడు ఉపాధ్యాయులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేలా సానుకూల దృక్పథంతో సూచనలు చేయాలని తెలిపారు. మంగళవారం సమావేశమందిరంలో డిప్యూటీ ఈవో, డిప్యూటీ ఐఓఎస్, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్స్, మండల నోడల్ అధికారులు, డీఆర్‌పీఎస్, సర్వశిక్షా అభియాన్ కోఆర్డినేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్లస్టర్ నోడల్ అధికారులు, మండల నోడల్ అధికారులు పాఠశాలలను సందర్శించినప్పుడు వారి పర్యవేక్షణ స్నేహపూర్వక వాతావరణంలో ఉండాలని చెప్పారు. పాఠశాలల్లో వివిధ సమస్యలపై క్షుణ్ణంగా చర్చించాలని, తరగతి గది పరిశీలనకు ముందు ఉపాధ్యాయులతో కాసేపు మాట్లాడాలని చెప్పారు. ఏ పాఠశాల్లో ఎటువంటి సమస్య తలెత్తినా తక్షణమే తన దృష్టికి తీసుకురావాలన్నారు. తరగతి గదిని గమనిస్తూనే బోధనలోని అంతరాలను నోట్ చేసుకోవాలని సూచించారు. ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీలలో అంతరాలను గుర్తించడానికి ఉపాధ్యాయులకు మార్గనిర్ధేశనం చేయాలన్నారు. టూర్ షెడ్యూల్ ప్రకారం క్లస్టర్ నోడల్ అధికారులు, మండల నోడల్ అధికారులు హైదరాబాద్ జిల్లాలోని అన్ని పాఠశాలలను సందర్శించాలన్నారు. అకాడమీ గైడ్‌లైన్స్ పెండింగుల గురించి రిజిస్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.రోహిణీ తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## టౌన్‌ప్లానింగ్ అధికారులతో కమిషనర్ సమీక్ష

**ఉప్పల్, ఆగస్టు 13 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు, కోర్టు కేసులు, చెరువుల సుందరీకరణ తదితర అంశాలను మంగళవారం డిప్యూటి కమిషనర్ అంజనేయులు పలువురు టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఇతర సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డిసి అంజనేయులు మాట్లాడుతూ ఉప్పల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనుమతి లేకుండా నిర్మాణాలు చేయవద్దని సూచించారు. సర్కిల్ పరిధిలోని చెరువులను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. చెరువు శిఖం పరిధిలో ఎటువంటి అక్రమణలు లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ ఎసిపి వెంకటరమణ, టిపిఎస్ సురేష్, సూపర్‌వైజర్ రాజు, చైన్‌మెన్ విజయ్, రవి, శ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ జెండాలు అందజేత



జాతీయ జెండాలను అందచేస్తున్న బిజెపి నాయకులు డి.గోపాల్‌జీ

**గన్‌ఫౌండ్రి, ఆగస్టు13ప్రభాతవార్త:** భారత ప్రభుత్వం పిలుపు మేరకు ఘర్,ఘర్ త్రిరంగా పేరిట గోషామహల్ నియోజక వర్గంలో త్రిరంగా యాత్రను నిర్వహించడం జరుగుతుందని తెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యాలయం ఇన్‌చార్జ్ డి.గోపాల్‌జీ తెలిపారు. ఈమేరకు నాంపల్లి బిజెపి కార్యాలయంలో బిజెపి నాయకులకు,కార్యకర్తలకుజాతీయ జెండాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు శేఖర్, ఉమాశంకర్, దినేష్, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ బోనాల జాతరలో జగదీశ్వర్‌గౌడ్



పోచమ్మఅమ్మవారి దేవాయలంలో పూజలు నిర్వహిస్తున్న శేరిలింగంపల్లి కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ తదితరులు

**శేరిలింగంపల్లి, అగస్టు 13ప్రభాతవార్త**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పర్వదినం ప్రతీకగా నిలుస్తుందని శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. శ్రావణ మాసం బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ పోచమ్మ అమ్మవారి దేవాలయంలో డివిజన్ నాయకులతో కలిసి బోనాల జాతర కార్యక్రమంలో జగదీశ్వర్‌గౌడ్ హజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఏటా మాదిరిగా ఏడాది కూడా శ్రావణ మాసం బోనాలను శ్రీశ్రీశ్రీ పోచమ్మ అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించుకోవడం ఆనందదాయకమన్నారు. నియోజకవర్గంలోని ప్రజలంతా అమ్మవారి చల్లని దీవెనలతో ఆరోగ్యంగా ఉండాలని ఆయన కోరానరు ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రీ పోచమ్మ దేవాలయం ఆలయ నిర్వాహకులు, పార్టీ కార్యకర్తలు, పురప్రముఖులు పాల్గొన్నారు.

### శ్రీవిజయదుర్గాభవాని అమ్మవారికి మహాకుంభాభిషేకం

**శేరిలింగంపల్లి, అగస్టు 13ప్రభాతవార్త**

శ్రీవిజయదుర్గాభవాని అమ్మవారి ఆశీస్సులతో శేరిలింగంపల్లి నియోజక వర్గ ప్రజలు సుభిక్షంగా శోభిల్లాలని శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శ్‌నగర్‌కాలనీలో శ్రీశ్రీశ్రీ విజయ దుర్గ భవాని అమ్మవారి దేవాలయంలో అమ్మవారికి మహాకుంభాబిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి మహాకుంభాభిషేక కార్యక్రమానికి శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ అయురారోగ్యాలతో సుఖసంతోషాలత ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్‌ను సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ ఆశోక్,ఉపాధ్యక్షులు సత్తికుమార్,ప్రధాన కార్యదర్శి ఆశోక్‌కుమార్,మురుగేశ్, హరినాథ్,మహేశ్, శ్రీనివాస్,ప్రణీష్, కర్ణ, గుణ శేఖర్; గోపాల్, ధర్మరాజు,వేలు, శ్రీనివాస్,పద్మారావు, హనుమాన్ యూత్ అధ్యక్షులు రాజు, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మహేశ్‌చారీ,సుబాష్ రాథోడ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

### పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి : మేయర్



బండ్లగూడ కార్పోరేషన్ లోని 10.వ,వార్డులో డ్రైనేజి పనులు పరిశీలిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్ తదితరులు.

**నార్సింగి, ఆగస్టు 13 ప్రభాతవార్త :**

అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం కార్పోరేషన్ పరిధిలోని 10.వ,వార్డులో జరుగుతున్న భూగర్భ డ్రైనేజి పనులను డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్ ప్రశాంత్ నాయక్‌లతో కలిసి మేయర్ లతాగౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని, కుల,మత,పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. మంచి పనులు చేసి, వేగంగా బండ్లగూడ కార్పోరేషన్‌ను అభివృద్ధి చేసి, ప్రజలలో మంచి గుర్తింపు తెచ్చుకునేందుకు అహర్నిషలు కష్టపడుతున్నామని వివరించారు. పని చేసిన వారికే ప్రజలు ఎన్నికలలో పట్టం కడుతారని, ప్రజలిచ్చిన అధికారంతో ప్రజల సమస్యలు వేగంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రేమ్‌గౌడ్, విఘ్నేశ్వర కాలనీ, ఫైన్‌ఆర్ట్స్ కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మానవత్వం పరిమళించిన మహాకవి జంధ్యాల పాపయ్యశాస్త్రి



ప్రసంగిస్తున్న తెలంగాణ శాసనసభ తొలి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి

**చిక్కడపల్లి, ఆగస్టు 13 ప్రభాతవార్త:** కవిత్వంలో కరుణరసం నింపి, సమాజ హితానికి నడుంబిగించిన మహాకవి జంధ్యాల పాపయ్యశాస్త్రి అని తెలంగాణ శాసనసభ తొలి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. మంగళవారం ఎందరోమహానుభావులు మధురస్మృతులు కార్యక్రమంలో భాగంగా కవి పండితులు, విమర్శకులు, సంపాదకులు జంధ్యాల పాపయ్యశాస్త్రి(కరుణశ్రీ) సంస్మరణ సభ చిక్కడపల్లి త్యాగరాయగానసభ నిర్వహణలో అధ్యక్షులు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సిరికొండ మధుసూదనాచారి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు చింతలపూడి త్రినాథ రావు, జివిఆర్ కల్చరల్‌ఫౌండేషన్ అధినేత గుదిబండి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమాజంలో శాంతి వర్ధిల్లాలని, నైతిక విలువలు పరిరక్షించబడాలని, మానవాళి దు:ఖం నుంచి బయటపడి సుఖ: సంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ తన కవిత్వంతో ఎన్నో ఖండకావ్యములను వెలువరించిన మహాకవి కరుణశ్రీ అని అన్నారు. 20వ శతాబ్దంలో బాగా జనాదరణ పొందిన తెలుగు కవులలో జంధ్యాల పాపయ్యశాస్త్రి ఒకరని, ఆయన రచనల్లో సులభమైన శైలిలో, సమకాలీన ధోరణిలో, చక్కని తెలుగు నుడికారంతో వినసొంపుగా ఉంటుందన్నారు. కరుణ రస ప్రధానంగా కవితలు రాసి 'కరుణశ్రీ' గా పేరును సంపాదించారన్నారు. నేటికి ప్రజల్లో కరుణశ్రీ పద్యాలు ఎంతో ఆదరణ పొందాయన్నారు. వైవిధ్యమైన సంస్థ త్యాగరాయ గానసభ అని, ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన కళానిలయం గానసభ అని అన్నారు. నగరంలో కీర్తికిరీటంలో కలికితురాయిగా వెలుగొందుతున్న కళాసంస్థ అని అన్నారు. ఈ సందర్భంగా పురాణపండ శ్రీనివాస్ రూపొందించిన 'ఉగ్రం...వీరం' ఆధ్యాత్మిక పుస్తకాన్ని ఆవిష్కరించారు.

# తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

### -మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంఘం డిమాండ్



ఉద్యమకారుల సంఘం పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

**హైదరాబాద్, ఆగస్టు 13,ప్రభాతవార్త:**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా తెలంగాణ ఉద్యమ కారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షులు సామాఅంజిరెడ్డి, ఉపాధ్యక్షులు పిడమర్తి లింగయ్య, కార్యదర్శి సైదులు సంఘం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించకుండా అట్టడుగున తొక్కేసిందని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి 250 గజాల స్థలంలో ఇండ్లను నిర్మించి ఇవ్వాలన్నారు. అలాగే ఉద్యమ కారులకు ఉచిత విద్యా,వైద్యం, బస్సుసౌకర్యం కల్పించడంతోపాటు 25వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని కోరారు. అలాగే తెలంగాణ ఉద్యమం సమయంలో అమరులైన 1400మంది అమరవీరుల కుటుంబాలకు 20లక్షల రూపాయలు, ఇంటికో ఉద్యోగం కల్పించాలని త్వరలో సంక్షేమ సంఘం భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉద్యమకారులు యూసఫ్, షరీఫ్, శైలేందర్, గోవర్ధన్, రఘునందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మణికొండలో "హర్ ఘర్ తిరంగా"కు అపూర్వ స్పందన

**నార్సింగి, ఆగస్టు 13 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నిర్వహించిన "హర్‌ఘర్ తిరంగా" కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన వచ్చింది. బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మర్రిచెట్టు చౌరస్తా నుంచి ఆంధ్రబ్యాంకు చౌరస్తా వరకు బిజెపి నాయకులు, కార్యకర్తలు చేతిలో జాతీయ జెండాలు పట్టుకొని భారత్ మాతాకీ జై అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. దారిలో ఉన్న ప్రతీ ఇంటికి జాతీయ జెండాలు పంపిణీ చేసి, ఇంటిపై ఎగురవేయాలని సూచించారు. ఈ ర్యాలీకి ఇళ్ల పైనుంచే కొందరు మహిళలు భారత్‌మాతాకీ జై అంటూ పిడికిలి బిగించి మద్దతు పలికారు. యువకులు స్వచ్ఛందంగా ఈ ర్యాలీలో పాల్గొని తమ దేశభక్తిని చాటుకున్నారు. దారి మొత్తం మువ్వన్నెల జెండాల రెపరెపలతో కనిపించింది. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం పండగ వాతావరణంలా కనిపించింది. ఈ కార్యక్రమానికి బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నర్సిహ్మారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ జాతీయ జెండాను చేతపట్టుకోగానే గుండెల నిండా దేశభక్తి తన్నుకు వస్తుందన్నారు. భారత జాతినంతటిని ఏకతాటిపైకి తీసుకు వస్తున్న జెండా పండగలో అందరం పాల్గొనాలని సూచించారు. ప్రతీ ఒక్కరం మన ఇళ్లపై జాతీయ జెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. మనమంతా నేడు స్వేఛ్చా వాయువులు పీల్చుకునేందుకు దేశభక్తులు, స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను త్యాగం చేశారని వివరించారు. మనలోని అనైక్యతను ఆసరాగా చేసుకొనే గతంలో మొఘలులు, తురుష్కులు, ఆంగ్లేయులు మనలను బానిసలుగా చేసుకొని వెయ్యేళ్ల పాటు ఇబ్బందులకు గురి చేశారని, ఇప్పుడు ఐక్యతగా లేకపోతే మళ్లీ బానిసలుగా మారడం తప్పదని హెచ్చరించారు. పెద్దలంతా ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న సంఘటనలు చూసి కళ్లు తెరువాలని, మన జాతి ఐక్యత కోసం, మన బిడ్డలకు మన ధర్మంను చెప్పి, ఆచరింపచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనిత, సీనియర్ నేతలు నరేందర్‌రెడ్డి, బీరప్ప, సిద్దప్ప, ఇంద్ర, శ్వేత, వందన, లక్ష్మీ, వీణ, లతాశ్రీ, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## "మావాటా.. మాకే "పుస్తకావిష్కరణ



**హైదరాబాద్, ఆగస్టు 13,ప్రభాతవార్త:**

సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరి శంకర్ రచించిన మావాటా మాకే పుస్కకావిష్కరణ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ఈకార్యక్రమానికి శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ న్యాయమూర్తులు జస్టిస్ ఈశ్వరయ్య, జస్టిస్ చంద్రకుమార్, మాజీ ఐఎఎస్ చిరంజీవులు, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ప్రొఫెసర్ లక్ష్మణ్ తదితరులు ముఖ్యఅతిధులుగా హాజరై ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో ఏదేశంలో లేని వివక్ష భారతదేశంలో ఉందన్నారు. కులగణన చేస్తే వారి పప్పులు ఉడకవని అగ్రకులాల నాయకులు కుట్రలు ఏళ్లుగా పనుతున్నారని ఇప్పుడు బిసి సమాజమంతా ఏకమవుతుందని నాయకులు కులగణన చేస్తారా లేక కుర్చీ దిగుతారా తేల్చుకోవాలని హెచ్చరించారు.

# ప్రమాదకరంగా మారిన డ్రైనేజీ

### -మృత్యువాతపడుతున్న మూగజీవాలు

### -ఆవు జలసమాధి..పట్టించుకోని అధికారులు



ఎన్ఎఫ్‌సీనగర్‌లో ప్రమాదకరంగా మారిన సెప్టిక్‌ట్యాంక్ మురికి కుంట

**ఘట్‌కేసర్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీనగర్‌లో సెప్టిక్‌ట్యాంక్ మురికికుంట ప్రమాదకరంగా మారింది. కాలనీ నుంచి వెలువడుతున్న డ్రైనేజీ వ్యర్థాలతో సెప్టిక్‌ట్యాక్ నిండి మురికి పొంగి పోర్లుతున్నది. ఈమురికికుంటలో ప్రమాదవశాత్తు మూగజీవాలు పడి మృత్యువాత పడుతున్నా అధికారులు ఏలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈకు ంటలో పడి పశువులు, మేకలు మృతిచెందగా తాజాగా మక్తఅనంతారంకు చెందిన రైతు మల్లేశ్‌కు చెందిన రెండు ఆవులు మునిగిపోగా స్థానికులు గమనించి ఒక ఆవును తాడుతో బయటకు లాగారు. మరొక ఆవు సెప్టిక్‌ట్యాంకు లోపలికి జారి జలసమాధై నాలుగు రోజులు అవుతుందని తెలిపారు. ఎన్ఎఫ్‌సీనగర్ ఏర్పడిన సమయంలో అంకుశాపూర్ రోడ్డులో సెప్టిక్‌ట్యాంక్ నిర్మించగా రెండు దశాబ్దాలకు పైగా డ్రైనేజీ నీటితో నిండి మురికి బయటకు వెదజల్లుతున్నది. వర్షాలు కురిసిన సమయంలో మురికినీరు అంకుశాపూర్ రోడ్డు నుంచి దిగువకు పారుతుండటంతో పరిసర ఇళ్లలో నివసిస్తున్న ప్రజలు దుర్వాసన దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి సెప్టిక్ ట్యాంక్ సమస్యకు అధికారులు, ప్రజాప్రతినిధులు శాశ్వతమైన పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

### -రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం

**హైదరాబాద్, ఆగస్టు 13,ప్రభాతవార్త:**

ప్రభుత్వ మేనేజ్‌మెంట్ ఉపాధ్యాయులకు ఎంఈవో పోస్టుల పదోన్నతులను కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కాసం ప్రభాకర్, మహ్మద్ ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ ...గత మూడు దశబ్దాలుగా ప్రభుత్వ మేనేజ్‌మెంట్ ఉపాధ్యాయులకు రావాల్సిన ఎంఈవో, డిప్యూటీ ఈవో పదోన్నతులను ఉమ్మడి సర్వీస్ రూల్స్ పేరుతో ప్రభుత్వ యాజమాన్యం, జిల్లా పరిషత్ యాజమాన్యాలు కలిపి ఇవ్వడం జరిగిందన్నారు. తద్వారా ప్రభుత్వ మేనేజ్‌మెంట్ ఉద్యోగు లకు తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. దీనిపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంను ఆశ్రయించ డంతో ఉమ్మడి సర్వీస్ రూల్ చెల్లవని ప్రభుత్వ ఉపాధ్యాయులకు అనుకూలంగా తీర్పు రావడం జరిగిందన్నారు. అయినప్పటికీ పర్యవేక్షణ అధికారులకు సంబంధించిన ఎంఈవో, డిప్యూటీ ఈవో పదోన్నతులు తమకు కల్పించడకపోవడం పర్యవేక్షణ కుంటుపడి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏపీ ప్రభుత్వ ఉపాధ్యా యులకు, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు ఎంఈవో, ఎంఈవో1, ఎంఈవో2గా పదోన్నతులు కల్పిస్తున్నారని అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం కూడా కల్పించినట్లయితే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. అన్ని మండలాలకు ప్రస్తుతమున్న ఎంఈవోలను ప్రభుత్వం ఉపాధ్యాయులకే పదోన్న తులు కల్పించాలని లేనిపక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## ఎల్ఐసి కార్యాలయం ఎదుట ధర్నా

**సైఫాబాద్, ఆగస్టు 13 ప్రభాతవార్త:** ఎల్ఐసి సంస్థకు చెందిన 60 వేల కోట్ల రూపాయలను అదానీ కంపెనీలో పెట్టుబడులు పెట్టడాన్ని ప్రమాదరకమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సిఎ వేణుగోపాలస్వామి ఆరోపించారు. అదానీ షేర్ల విషయంలో ఎస్ఇబిఐ ఛైర్పర్సన్ రాజీనామా చేయాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ చేసిన డిమాండ్‌కు మద్దతుగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆనేక మంది కార్యకర్తలు మంగళవారం ఆదర్శనగర్‌లోని ఎల్ఐసి జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని 30 కోట్ల మంది ఎల్ఐసి పాలసీదారులకు చెందిన 60 వేల కోట్ల రూపాయల సంపదని అదానీకి కంపెనీలో పెట్టుబడులు పెట్టడం వల్ల పాలసీదారులకు రక్షణ ఉండదని చెప్పారు. అదానీ సంస్థపై ఆనేక ఆరోపణలు ఉన్నాయని, ఆ డబ్బుకు ఎవరూ గ్యారంటి ఇస్తారని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ అదానీ కంపెనీలో షేర్ల విలువ పడిపోతే ప్రజల డబ్బుకు నష్టం జరిగే ప్రమాదం ఉందని, పేద ప్రజలు కూడగట్టుకున్న డబ్బును కాపాడవలసిన బాధ్యత తమపై ఉందన్నారు. ఈ పెట్టుబడులను ఉపసంహరించుకునేంత వరకు తాము ఉద్యమిస్తామని, ఈ సంఘటనపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే సిబిఐచే విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో తాము సుప్రీంకోర్టులో కేసు వేస్తామని హెచ్చరించారు.

## ప్రైవేట్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

### -పిడిఎస్‌యు చేవెళ్ల డివిజన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్

**చేవెళ్ల ఆగస్టు 13, ప్రభాతవార్త**

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను విద్యార్థుల ప్రాణాలతో చెలగాట మాడుతున్న చేవెళ్ల శ్రీ చైతన్య టెక్నోస్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు చేవెళ్ల డివిజన్ ప్రధాన కార్యదర్శి బొజ్జ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం పాఠశాలకు చెందిన బస్ చేవెళ్లలోని దేవాలయం ముందుకు రాగానే బస్ బ్రెక్ ఫెయిల్ అయి బ్రెకింగ్ హెర్ ట్యాంక్ ఊడిపోయి రోడ్డుపై పడిందని, అదే సమయంలో వాహనాలు వాస్తే పెద్ద ప్రమాదం జరిగేదన్నారు. బస్ రాడ్ పడిపోవడంతో విద్యార్థులు బస్‌లోనే గంట పాటు ఉన్నారని, బస్‌లకు ఫిట్ నెట్ లేకండా ఏలా నడుపుతున్నారన్నారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న యాజమూన్యంపూ కఠినంగా చర్య లు తీసుకోవాలన్నారు. ఆర్టీఓ అధికారులు నామా మాత్రం తనిఖీలు చేసి చెతులు దులుపుకుంటున్నారన్నారు. ఫిట్ లేని బస్సులను నడు పుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున అందోళన చేస్తామన్నారు.

## ఉత్సాహంగా మహిళామోర్చ తిరంగా ర్యాలీ

**ఘట్‌కేసర్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ పట్టణంలో బిజెపి మహిళా మోర్చ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు ముద్దవరం లక్ష్మి నాయకత్వంలో మహిళా మోర్చ నాయకురాళ్లు, కార్యకర్తలు మూడురంగల జెండా చేతబూని ఉత్సాహంగా ర్యాలీ జరిపారు. ఘట్‌కేసర్ మున్సిపల్ శివారెడ్డిగూడ లోనిని ప్రసన్నవీరాంజనేయస్వామి దేవాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు తిరంగా ర్యాలీ కొనసాగింది. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మహిళామోర్చ కార్యవర్గసభ్యురాలు ఇంద్రారెడ్డి, బిజెపి రాష్ట్ర కార్య వర్గసభ్యురాలు కొమ్మిడి శోభారాణిలు పాల్గొన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు విప్పర్ల హనుమాన్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో అమరం సరస్వతీ, సంధ్యారెడ్డి, సరిత, కొన్నె మాధవి, వివిధ మండలా మహిళా మోర్చ అధ్యక్షురాళ్లు, నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ద్విచక్రవాహనాలు దొంగిలిస్తున్న వ్యక్తి అరెస్టు

**చిక్కడపల్లి, ఆగస్టు 13 ప్రభాతవార్త:**

తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని చిక్కడపల్లి పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మహ్మద్ ఖాలీద్ సైఫుల్ల అనే వ్యక్తి తన ప్లాటినం బైక్‌ను ఆర్టీసిక్రాస్ రోడ్స్‌లోని బావార్చి హోటల్ ముందు పార్కు చేసి లోనికి వెళ్లి తిరిగి వచ్చేసరికి తన వాహనం కనిపించలేదు. దీంతో తన వాహనం చోరీకి గురైనట్లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీ పుటేజీల ఆధారంగా ద్విచక్రవాహనం దొంగతనానికి పాల్పడిన వ్యక్తి ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన ఉడుగుల్ల సుమంత్ అలియాస్ సంతోష్ అని తేల్చారు. బాగ్‌లింగంపల్లి ప్రాంతంలో వాహనాల చెకింగ్ చేస్తున్న సమయంలో అతడిని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన దొంగతనాన్ని అంగీకరించాడు. పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## హర్ ఘర్ తిరంగాను ఘనంగా జరుపుకోవాలి

### -చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పిలుపు



ఎమ్మెల్యే కాలే యాదయ్యకు జాతీయ జెండాను అందజేస్తున్న సికిందరాబాద్ డివిజన్ పోస్టల్ అధికారులు

**చేవెళ్ళ,ఆగస్టు 13, ప్రభాతవార్త**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన హర్ ఘర్ తిరంగాను ఘనంగా ప్రతి ఒక్కరు జరుపుకోవాలని చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య పిలుపునిచ్చారు. సికిందరాబాద్ డివిజన్ పోస్టల్ అధికారులు జాతీయ జెండాను మంగళవారం చేవెళ్ల ఏమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏమ్మెల్యే కాలే యాదయ్యను కలిసి జాతీయ జెండాను అందించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ ఆగస్టు 15న ప్రతి ఒక్కరి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసి తమ దేశభక్తిని చాటుకోవాలన్నారు. పోస్టల్ శాఖ బ్యాంకింగ్ బీమా, టర్మ్, పాలసీలు, చిన్న మొత్తం పొదుపు వంటి అనేక సేవలు అందించడం జరుగుతుందన్నారు. చేవెళ్ల నియోజకవర్గ ప్రజలు ప్రతి ఒక్కరు పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ పోస్టల్ సబ్ డివిజన్ ఇన్స్‌పెక్టర్ బాలక్రిష్ణా, ఎంఓ బీరయ్య, చేవెళ్ల పోస్టు మాస్టర్ నరేష్, సతీస్ తదితరులు పాల్గోన్నారు.

## నంబర్‌ప్లెట్ లేకుంటే వాహనం సీజ్ : ఎస్ఐ ప్రదీప్‌కుమార్



నంబర్‌ప్లెట్‌లేని వాహనాలను చెక్ చేస్తున్న చేవెళ్ల ఎస్ఐ ప్రదీప్‌కుమార్

**చేవెళ్ళ,ఆగస్టు 13, ప్రభాతవార్త**

ద్విచక్ర వాహనాలకు నంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని, నంబర్‌ప్లేట్ లేని వాహనాలు రోడ్ల మీద కనిపిస్తే సీజ్ చేస్తామని చేవెళ్ల ఎస్ఐ ప్రదీప్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం చేవెళ్ల పోలీస్ ముందు గత రహదారిపై వాహనాలను తనిఖీలు చేశారు. సైబరాబాద్ కమీషనర్ మహంతీ అదేశాలతో వాహనదారులకు అవగామన కల్పించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎస్ఐ ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు మీద తిరిగే ప్రతి వాహనంకు నంబర్ ప్లెట్ తప్పనిసరిగాఉండాలని, నంబర్‌ప్లెట్ లేకున్నా, కన్పించకుండా స్టిక్కర్‌లను అంటించిన క్రిమినల్ కెసులను నమోదు చేయడంతో పాటు వాహనంను సీజ్ చేస్తామన్నారు. వాహనంకు నంబర్‌ప్లట్‌తో పాటు ఫిట్‌నేట్, పోల్యూషన్, ఇన్స్‌రెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌లు తప్పని సరిగా ఉండాలని, వాటిలో ఏది లేకున్నా కెసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్చక్రమలో ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## ప్రభుత్వ కళాశాలలో సమస్యలను పరిష్కరించాలి

**కొడంగల్,ఆగష్టు 13ప్రభాతవార్త**

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన ్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్,ఉపాధ్యక్షులు అనిల్, కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షలు రాజులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ అధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న సమస్యలు,వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు గల బస్సు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కొడంగల్‌లో విద్యను అభ్యసిస్తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు,ప్రభుత్వ జూనియర్ కళాశాల,ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతన్న విద్యార్థులకు తగినన్నిచ బస్సులు లేక ఉన్నా సమయానికి రాకపోవడంతో విద్యార్థులు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొడంగల్ ప్రాంతానికి అధిక బస్సులు కల్పించి గ్రామాల స్టేజీల దగ్గర ఎక్స్‌ప్రెస్ బస్సులు అపేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ఎన్కెపల్లి నుంచి ప్రతినిత్యం 125 మంది విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు కొడంగల్‌కు రావడం జరుగుతుందని,వీరికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలకు డబ్బులు చెల్లించలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి ఎనె ్కపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు బత్తుల శివకుమార్,బత్తుల మల్లీశ్వరీ తదితరులు ఉన్నారు.

## శుభాకార్యాలకు బస్సుల బుకింగ్‌పై 10 శాతం రాయితీ

**మేడ్చల్, ఆగస్టు 13. ప్రభాతవార్త :** శ్రావణమాసం సందర్భంగా శుభాకార్యాలకు బస్సులను బుకింగ్ చేసుకున్న వారికి 10 శాతం రాయితీ సౌకర్యం కల్పిస్తున్నామని మేడ్చల్ బస్ డిపో మేనేజర్ సుధాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 3వ తేదీ వరకు బుక్ చేసుకునే అన్ని రకాల బస్సులకు ఈ రాయితీ సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని, ఈ అవకాశాన్ని డిపో పరిధిలోని మేడ్చల్ పట్టణ, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరాడు.

## స్వాతంత్ర్య దినోత్సవానికి ఉపాధ్యాయుడికి ఆహ్వానం

**కోట్‌పల్లి,ఆగస్టు 13, ప్రభాతవార్త;**

ఢిల్లీలో జరగబోయే దేశ స్వాతంత్ర వేడుకలకు కోట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కె,లక్ష్మణ్, అదే పాఠశాలకు చెందిన విద్యార్థి కె, సాయి చరణ్‌కు ప్రత్యేక ఆహ్వానం అందడం జరిగిందని కోట్‌పల్లి మండల విద్యాధికారి చంద్రప్ప తెలిపారు. అసందర్భంగా అయన మాట్లాడుతూ. ఈ మహసభలో ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా కె. సాయిచరణ్, ప్రశంసా పత్రం అందుకోవడం జరుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన విద్యార్థుల ఎంపికలో కోట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రావిణ్యం ప్రదర్శించడం గొప్ప గౌరవంగా చెప్పుకోవచ్చన్నారు. ఈ సందర్భంలో విద్యార్థి సాయిచరణ్ విజయాలకు తోడ్పడిన ఉపాధ్యాయుడు కె, లక్ష్మణ్ సేవాలను ప్రధాని నరేంద్రమోడీ ప్రత్యేకంగా ప్రశంసించనున్నారు. అయితే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గోనెందుకు ఉపాధ్యాయుడు ,విద్యార్థి నేడు హైదరాబాద్ నుండి విమానంలో ఢీల్లీకి బయలు దేరి వెళ్ళారని అయన పేర్కొన్నారు.

IN THE COURT OF HON'BLE III SENIOR CIVIL JUDGE, C.C.S., AT: SECUNDERABAD
E.P. No. 195 of 2019 IN O.S. No. 45 of 2019

Between:
**M. Vedantika** ...Decree Holder
AND
**Sailesh Kumar Gujjar** ...Judgment Debtor

To,
**Mr. Sailesh Kumar Gujjar,** S/o. Late Nagender Rao Gujjar, Aged about 57 Yrs, Occ: Business, R/o. 4-1-42, Old Bhoiguda, Subhash Road, Secunderabad-03.

**SALE PROCLAMATION NOTICE**

In the above mentioned E.P., the below mentioned property is brought for Sale to realize the Decree Debt **Rs. 5,35,143/-** with cost and interest till realisation. Auction is going to be held on **27/08/2024** at Court premises at 10.30 A.M., and further hearing on **02-09-2024.** Therefore, whoever is interested in purchasing the property can attend and participate in bid.

**SCHEDULE OF 'A' PROPERTY**

All the Part & Parcel of H.No. 4-1-46, consisting of Ground and First Floors, having a plinth area of 652 Sq.Ft., along with land admeasuring 36.21 Sq.Yards or 31.58 Sq.Mtrs., situated at Old Boiguda, Secunderabad bounded by: **North**: H.No. 2313 (New No. 4-1-45), **South**: H.No. 4-1-46, **East**: H.No. 4-1-41, **West**: H.No. 2313( New No. 4-1-45).

**SCHEDULE OF 'B' PROPERTY**

All that the undivided 2/3 Share of the House property admeasuring 100.66 Sq.Yards., out of 151.00 Sq.Yards, consisting of Ground plus 4 Floors along with land admeasuring 151 Sq.yds situated at Old Boiguda, Secunderabad, bounded by: **North**: H.No. 4-1-41, **South**: H.No. 4-1-44, **East**: Road, **West**: H.No. 4-1-46.

**( By order of the Hon'ble Court )**
Sd/- **Ch. VANDANA MALATKAR,**
Advocate,
Plot No. 11, Samrat Colony,
West Marredpally, Secunderabad.
**Cell: 9848875075**

IN THE COURT OF THE HON'BLE ADDL. FAMILY COURT JUDGE, RANGA REDDY DISTRICT COURT, AT L.B.NAGAR
F.C.O.P. No. 460 OF 2023

Between:
**K. Srikanth Sai Kanth** ...Petitioner
AND
**Mrs. K. Praveena @ Vani** ...Respondent

To
**Mrs. K. Praveena @ Vani,** W/o. K. Srikanth Sai Kanth, R/o. H.No 2N/3, Road No.1, Street No.3, Subadranagar, Opp: More Super Market Lane, Vanasthalipuram, R.R.District.

Whereas the abovenamed Petitioner has filed the above F.C.O.P. praying the said court for dissolution of marriage and for that reason, you are hereby called upon to be present in person or through your counsel duly instructed on the **30 th day of August, 2024, at 10-30 a.m.** before the said Court, failing which the above petition will be decided against you.

//BY ORDER OF THE COURT//

**V. MANOJ KUMAR**
**Smt. S. SWAPNA**
**ADVOCATES**
H.No. 2-4-36/E, PLOT No.12, ROAD No.9, NEW NAGOLE COLONY, HYDERABAD.
**MOBILE No. 9948098503 8639336710**

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE: R.R. DISTRICT AT L.B.NAGAR.
G.W.O.P. NO. 40 OF 2024

Between:
**Ramaraju Ram Mohan Rao & another** ...Petitioners
And
**The Deputy Registrar, & another** ...Respondents

To
**All Concerned**

**NOTICE**

Please take notice that the above-named petitioner NO.1 **Ramaraju Ram Mohan Rao,** S/o. Late Sri R. Venkateshwar Rao, has filed the above O.P., to grant permission to the Petitioner No.1 to appoint him as guardian of mentally retarded sister R. Radha, D/o. S/o. Late Sri R. Venkateshwar Rao,U/s. 14 Rights Of Persons With Disabilities Act 2016. The case is posted to **29.08.2024** appearance and to raise any objections to the case. If any person/ persons having any objection or right or claim for granting permission for appointing the Petitioner No.1, may appear in this court either in person or through an Advocate duly instructed on **29.8.2024 at 10.30 a.m.** If you fail to appear before the court on the said date and time, the matter will be heard and decided exparte on merits.

//BY ORDER OF THE COURT//

**V. MANOJ KUMAR**
**ADVOCATE**
H.No. 2-4-36/E, PLOT No.12, ROAD No.9, NEW NAGOLE COLONY, HYDERABAD. **MOBILE No. 9948098503, 8639336710**

